
# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

గురువారం 11 డిసెంబర్ 2025 పేజీలు 8

GOVERNMENT OF TELANGANA
(REVENUE DEPARTMENT)

Office of the Tahsil,
Gandimaisamma-Dundigal Mandal.

Dated:07.05.2024.

No.B/528/2024

NOTICE UNDER SECTION 7 OF
A.P. LAND ENCROACHMENT ACT III OF 1905

To
Kum. Gaddam Sahiti Reddy D/o. G.Surender Reddy

Whereas you are reported to be un-authorized occupation of the land specified in the scheduled below, which is the property of Government. You are hereby given notice that if you desire so you may, before 2 days show cause either in person or in writing before me/the Collector why you should not addition to the full assessment on the land under section (3) (1) of the Act to the rate prescribed by or under section 3 (ii) of the act to charged a penalty for such occupation under section 5 of Act III of 1905 or and be subjected to eviction from the land and things deposited there on under section 6 of the said Act.

| Name of Village | Sy. No. and Sub-Division | Description of land | Total extent Ac-gts., | Encroached extent Ac-gts., | Nature of Occupation |
|---|---|---|---|---|---|
| Bahadurpally | 227 | Poramboke | 353-35 | 400 sq. yds (approx) | (01) Shed |

In view of the above the Girdawar of this office are directed to service and to return the served copy.

Tahsildar,
Gandimaisamma-Dundigal Mandal.

9951944277

అక్రమ షెడ్డుకు దుండిగల్ తహశీల్దార్ ఇచ్చిన నోటీసు..

- దుండిగల్ మండలంలో ప్రభుత్వ భూముల పరిస్థితి అత్యంత దయనీయం..
- "దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్న" చందంగా..! అక్రమార్కులకే ప్రాధాన్యత..!
- అవినీతి అధికారులకు కలిసొచ్చిన "తెలంగాణ రాష్ట్రం" ఏర్పాటు..!
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో అడిగేవారు లేక మొదలైన అధికారుల కరెప్షన్..?
- కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అదే ధోరణి..!భూ పరిరక్షులే..! బక్షకులుగా మారితే..?
- కంచే చేనుమేసిన చందంగా తయారైన దుండిగల్ ప్రభుత్వ భూముల పరిరక్షణ..

# అడిషనల్ కలెక్టర్ ఆదేశించినా..!

# చర్యలు శూన్యం..!

- 227 ప్రభుత్వ భూమిగా నిర్ధారించినా..! సురేందర్ రెడ్డి షెడ్డుపై చర్యలు శూన్యం..
- జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశాలు బుట్టదాఖలు..
- నోటీసులిచ్చిన తహశీల్దార్ మతీన్ ఏడాదిన్నరగా చర్యలకు దూరం..ఆపై బదిలీ..
- సర్కారీ పోరంబోకు భూమిలో అక్రమ షెడ్డుకు అటు పలుకుబడి..! ఇటు ముడుపులు..?
- నూతన తహశీల్దార్ బాధ్యతలు చేపట్టినా..! అక్రమ షెడ్డుపై చర్యలకు వెనకడుగు..
- బహుదూర్‌పల్లి 227 ప్రభుత్వ భూమిలో కులమే "కబ్జాలకు" బలమా..?

- చర్యలు తీసుకోమని అడిషనల్ కలెక్టర్ ఆదేశించినా..!దుండిగల్ రెవెన్యూ నిర్లక్ష్యం..!
- సురేందర్ 'రెడ్డి' అయినందునే..! అధికారులు సహకరిస్తున్నారా..?
- నోటీసులిచ్చిన గత తహశీల్దార్.. ముడుపులతో చర్యలకు దూరం..?
- కొత్త తహశీల్దార్ బాధ్యతలు చేపట్టినా..! చర్యలు లేవంటే అర్థం..?

## అధికారికంగా నోటీసులిచ్చి..! అనధికారికంగా "సెటిల్మెంట్‌లా..?

- 227 ప్రభుత్వ భూమిలో అక్రమ షెడ్డుపై..! ఏడాదిన్నరగా చర్యలకు వెనకడుగు..!
- చట్టాలంటే విలువ లేదు.. అధికారులకు బాధ్యత లేదు..



ప్రభుత్వ భూమిగా తీర్పు ఇచ్చిన 227 లో సురేందర్ రెడ్డి అక్రమ నిర్మాణం..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్,డిసెంబర్ 10:** ప్రభుత్వ భూమిలో 400 గజాలు కబ్జాచేసి నిర్మించిన, ఒక తప్పుడు అక్రమ షెడ్డుకు రెవెన్యూ అధికారులే స్వయంగా నోటీసులు జారీచేశారు..! అయినప్పటికీ చర్యలు శూన్యం..! రూ.లక్షల్లో దండుకోవడం తోపాటు, సామాజికవర్గం ప్రాతిపదికన కూడా,రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకుండా, సహకరిస్తున్నారని వస్తున్న ఆరోపణలకు బలం చేకూరే విధంగా, దుండిగల్ గండిమైసమ్మ మండలం రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.. ఏదోఒక రకంగా సురేందర్ రెడ్డి తన షెడ్డును దక్కించుకునేందుకు, భారీ మొత్తంలో మామూళ్ళు సమర్పించి చర్యలు లేకుండా మేనేజ్ చేస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు..

-2లో

# చైనా మాంజా విక్రయాలపై.. కఠిన చర్యలు తీసుకోవాలి..

## ఎమ్మెల్యే కేపీ వివేకానందకు పర్యావరణ ప్రేమికుడు రవిందర్ వినతిపత్రం..

- సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో నిషేధిత చైనా మాంజా అమ్మకాలు..
- ప్రాణాంతక చైనా మాంజాతో ద్విచక్ర వాహన దారులు, పక్షులకు ప్రాణాపాయం..
- సామాజిక వేత్తలు, పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం..
- గతంలో సైనిక అధికారి మరణం, ఇటీవల హైదరాబాద్‌లోనూ ఘటనలు..
- చైనా మాంజా విక్రయాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకి వినతి..
- పోలీస్ అధికారులు, సంబంధిత శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్..



-3 లో

# మేడ్చల్ జిల్లాలో జాతీయ రహదారుల ప్రాజెక్టులపై కలెక్టర్ సమీక్ష..

## రహదారుల పనులు వేగవంతం చేయాలి, పనుల్లో జాప్యం తగదన్న కలెక్టర్ మను..

- మేడ్చల్ జిల్లాలో జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశం..
- రహదారి విస్తరణకు సంబంధించి పెండింగ్ కోర్టు కేసులపై సమీక్ష..
- ఎన్‌హెచ్ఏఐ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమస్యల వివరణ..
- ఒక్కో కేసు పూర్వాపరాలు తెలుసుకొని తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు..
- అభివృద్ధి పనుల్లో ఆలస్యం జరగకుండా సమన్వయంతో పని చేయాలని దిశానిర్దేశం..

-4 లో



# అడిషనల్ కలెక్టర్ ఆదేశించినా..! చర్యలు శూన్యం..!




షెడ్డుకు నోటీసులిచ్చిన చోటనే ప్రభుత్వ నిధులతో అక్రమ సీసీరోడ్డు.. ఫైల్‌ఫోటో..



2023 అక్టోబర్ 7న శిలాపలకం ఎమ్మెల్యే శంకుస్థాపన నాటి.. ఫైల్‌ఫోటో..



ప్రభుత్వ భూమిలో అక్రమ సీసీరోడ్డును.. ప్రారంభించిన ఎమ్మెల్యే కే.పి.వివేకానంద.. ఫైల్‌ఫోటో..


## నోటీసును చిత్తు కాగితంలా భావిస్తున్న రెవెన్యూ..

దుండిగల్ గండిమైసమ్మ మండలం రెవెన్యూ అధికారుల ఉద్దేశం ఏద్దైనా..? చట్టప్రకారం జారీసిన నోటీసులు అంటే విలువ లేదు.. అధికారులకు బాధ్యత లేదని నిరూపిస్తున్నారు.. నోటీసులంటే రెవెన్యూ యంత్రాంగం చిత్తుకాగితంలా భావిస్తున్నట్టు, రెవెన్యూ చర్యలు లేని ఈ అక్రమ షెడ్డు ఒక ఉదాహరణగా చెప్పవచ్చు.. 2024 మే 7న నోటీసులు జారీ చేసిన రెవెన్యూ అధికారులు, నేటికీ చర్యల్లేవంటే జిల్లా అడిషనల్ కలెక్టర్ సమాధానం చెప్పాలి..ఈ అక్రమ షెడ్డు వ్యవహారంలో మరో అనధికారిక సమాచారం కూడా వినిపిస్తుంది.. తెలంగాణ సీఎం కార్యాలయం నుండి ఫోన్‌లు చేయించారని, అందుకే దుండిగల్ తహశీల్దార్ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి..ఇప్పటికే దుండిగల్ మండలం బౌరంపేట్ సర్వే నెం.166 ప్రభుత్వ భూమిలో ప్రైవేటు వెంచర్‌కి సీసీరోడ్డు నిర్మాణం విషయంలోనూ..! సీఎం సన్నిహితుడి ఈ కబ్జాలకు సీఎంవో సిఫార్సులు చేశారని తెలిసిందే.. అయితే ప్రభుత్వ భూముల కబ్జాలకు సీఎంవో సిఫార్సులు సర్వసాధారణంగా మారాయని పలువురు ఎద్దేవా చేస్తున్నారు..

- మొదటి పేజి తరువాయి

మేడ్చల్ జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండలం, బహుదూర్‌పల్లి సర్వే నెం.227 ప్రభుత్వ భూమి పరిరక్షణ విషయంలో సంబంధిత అధికారులు కొంత నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నట్టు అధికారుల పని తీరుతో తేటతెల్లం చేస్తుంది.. పాతికేళ్ళుగా హైకోర్టు పరిధిలోనే కేసు కొనసాగుతున్న 227 ప్రభుత్వ భూమి, 353.35 ఎకరాలు మొత్తం, సెక్షన్ 22-ఎ నిషేధిత జాబితాలోనూ ఉంది.. మరోవైపు హైకోర్టు డైరెక్షన్‌తో 2025 అక్టోబర్ 29న బహుదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 మొత్తం సర్కారీ పోరంబోకు భూమిగానే, మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.. అయినప్పటికీ అడదడపా అక్రమ కట్టడాలు రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే కొనసాగుతున్నట్టు స్పష్టమవుతుంది..

గతేడాది 2024 ఏప్రిల్ నెలలో ఓ ప్రముఖ బిల్డర్ 227 ప్రభుత్వ భూమిలో 400 గజాల్లో నిర్మించిన అక్రమ షెడ్డుకు “2024 మే 7న” నోటీసులు ఇచ్చిన దుండిగల్ ఎమ్మార్వో మతీన్, అక్రమార్కులతో భేరం కుదుర్చుకుని చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వచ్చాయి.. మరోవైపు ఈ అక్రమ షెడ్డుపై చర్యలకు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఏడాదిన్నరగా ఆదేశించినా చర్యలు పక్కనపెట్టి మామూళ్ళకే ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలుస్తుంది..



డి.పోచంపల్లి సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో..



డి.పోచంపల్లి సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో..



డి.పోచంపల్లి సర్వే నెం.156 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం..

గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో అక్రమ షెడ్డు...




మేడ్చల్ జిల్లా రెవెన్యూ యంత్రాంగం తీరుపై పత్రికల్లో వక్రీకరిస్తే తెగ ఫీలవుతారు.. మరి దుండిగల్ తహశీల్దార్ జారీచేసిన ఈ నోటీసుపై చర్యలు తీసుకోకుండా వదిలేయడాన్ని ఏవిధంగా పరిగణించాలి..? ముడుపులు స్వీకరించి వదిలేశారని అనాలా..? అక్రమ నిర్మాణ దారుడు సురేందర్'రెడ్డి' అయినందునే సామాజిక వర్గ పరంగా మేనేజ్ చేస్తున్నారని భావించాలా..? దుండిగల్ మండలంలో రెవెన్యూ అధికారుల పనితీరుపై ఇప్పటికే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో పేదలపట్టాల పేరుతో ఖాళీస్థలాలను కబ్జాచేసి దందాలు.. దొమ్మర పోచంపల్లి సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో 59 జీవో పట్టాల పేరుతో, కబ్జాలు రెవెన్యూ కనుసన్నల్లో పదుల సంఖ్యలో అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి.. కార్యాలయం పక్కనే సర్వే నెం.156లో ఓ అటవీశాఖ అధికారికి చెందిన అక్రమ నిర్మాణం..! గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో అక్రమ షెడ్లకు స్థానిక ఆర్ఐ సహకారం..? మల్లంపేట్‌లో సర్వే నెం.170/3, 170/4, 170/5, ఈ వెంచర్‌లో సుమారు 7.10 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్టు స్థానికులు గతేడాది చేసిన ప్రైవేటు సర్వేలో తేలిందని ఫిర్యాదు చేసినా..! దుండిగల్ రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు..




గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో ఆర్ఐ అసంపూర్తి చర్యలు..



డి.పోచంపల్లి సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో..



బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో పేదల పట్టాలతో దందా..



బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో నాగరాజు అక్రమ నిర్మాణాల దందా..



డి.పోచంపల్లి సర్వే నెం.120లో ఓపెన్ ప్లాట్లో అక్రమ నిర్మాణం..


కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కే.పి.వివేకానందకు పర్యావరణ ప్రేమికుల వినతిపత్రం..

# చైనా మాంజా విక్రయాలపై...
# కఠిన చర్యలు తీసుకోవాలి



## ఎమ్మెల్యే కేపీ వివేకానందకు పర్యావరణ ప్రేమికుడు రవిందర్ వినతిపత్రం..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, డిసెంబర్ 10:** సంక్రాంతి పండుగ సందర్భంగా గాలి పటాలను ఆకాశానికి ఎగుర వేసేందుకు, ఉపయోగించే నిషేధిత చైనా మాంజా(దారం) ను అక్రమంగా విక్రయిస్తున్న వ్యాపారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కే.పీ.వివేకానందను పర్యావరణ ప్రేమికులు కోరారు.. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు.. స్థానికంగా కొందరు వ్యాపారస్తులు చాడుమాటున చైనా మాంజాను విక్రయిస్తుండటం, తద్వారా, తీవ్ర ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు, పక్షులకు ప్రాణాపాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. గతంలో చైనా మాంజా కారణంగా ఒక సైనిక అధికారి ప్రాణాలు కోల్పోయిన ఘటనతో పాటు, ఇటీవల హైదరాబాద్‌లో చోటుచేసుకున్న సంఘటనను వారు గుర్తుచేశారు.. ఈ నేపథ్యంలో నిషేధిత మాంజా విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు అధికారులు, ఇతర సంబంధిత శాఖలు తక్షణమే చర్యలు తీసుకునేలా జోక్యం చేసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.. ఈ కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికులు కోలా రవీందర్ ముదిరాజ్, మన్నన్, డాక్టర్ హుస్సేన్, రాజు తదితరులు పాల్గొని చైనా మాంజా వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిషేధిత మాంజాపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు స్పష్టం చేశారు.

- సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో నిషేధిత చైనా మాంజా అమ్మకాలు..
- ప్రాణాంతక చైనా మాంజాతో ద్విచక్ర వాహన దారులు, పక్షులకు ప్రాణాపాయం..
- సామాజిక వేత్తలు, పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం..
- గతంలో సైనిక అధికారి మరణం, ఇటీవల హైదరాబాద్‌లోనూ ఘటనలు..
- చైనా మాంజా విక్రయాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకి వినతి..
- పోలీస్ అధికారులు, సంబంధిత శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్..








సమావేశంలో జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి.

# మేడ్చల్ జిల్లాలో జాతీయ రహదారుల ప్రాజెక్టులపై కలెక్టర్ సమీక్ష

## రహదారుల పనులు వేగవంతం చేయాలి, పనుల్లో జాప్యం తగదన్న కలెక్టర్ మను..



మిక్కిలినేని మను చౌదరి.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్..





ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్..

- మేడ్చల్ జిల్లాలో జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశం..
- రహదారి విస్తరణకు సంబంధించి పెండింగ్ కోర్టు కేసులపై సమీక్ష..
- ఎన్‌హెచ్ఏఐ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సమస్యల వివరణ..
- ఒక్కో కేసు పూర్వాపరాలు తెలుసుకొని తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు..
- అభివృద్ధి పనుల్లో ఆలస్యం జరగకుండా సమన్వయంతో పని చేయాలని దిశానిర్దేశం..



కలెక్టర్‌కు బుద్ధుని ప్రతిమను అందజేస్తున్న ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, డిసెంబర్ 10:** మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో కొనసాగుతున్న జాతీయ రహదారుల నిర్మాణ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంతో పాటు, రోడ్డు విస్తరణకు ఆటంకంగా మారుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లో జాతీయ రహదారుల నిర్మాణాలపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలోని జాతీయ రహదారి ప్రాజెక్టులకు ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్‌కు వివరించారు.. జాతీయ రహదారుల రోడ్డు విస్తరణకు సంబంధించి ఉన్న భూసేకరణ సమస్యలు, న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను కలెక్టర్ వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఒక్కో కేసుకు సంబంధించిన పూర్వపరాలను, సమగ్రంగా పరిశీలించాలని, చట్టపరమైన ఇబ్బందులను వేగంగా పరిష్కరించేలా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల్లో ఆలస్యం కాకుండా శాఖల మధ్య సమన్వయం పెంచాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.. ఈ సమావేశంలో కీసర ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఓట్ల కోసం కోటి తిప్పలు.. ఎన్నికల హామీ కింద ఊళ్ళో వైఫై పెట్టించిన సర్పంచ్ అభ్యర్థి..



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ వ్యాప్తంగా స్థానిక ఎన్నికల హడావిడి ఊపందుకుంది. తొలివిడత స్థానిక ఎన్నికలకు సమయం దగ్గర పడటంతో పల్లెల్లో పొలిటికల్ హీట్ పీక్స్ కి చేరింది. ఒక్క ఏకగ్రీవాలతో పలు గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొనగా.. మిగతా గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థుల పోటాపోటీ ప్రచారాలతో యుద్ధవాతావరణం నెలకొంది. తొలివిడత పంచాయితీ ఎన్నికలు గురువారం ( డిసెంబర్ 11 ) జరగనుండగా.. ఆయా పల్లెల్లో మైకులు మూగబోయాయి. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు అభ్యర్థులు. ఇదిలా ఉండగా.. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓ సర్పంచ్ అభ్యర్థి ఎన్నికల హామీ కింద ఊళ్ళో వైఫై ఏర్పాటు చేశాయి. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం లంబాడిహెట్టి గ్రామంలోలో గ్రామపంచాయతి ఎన్నికలలో సర్పంచ్ గా పోటి చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి బాలు వినూత్న రీతిలో ప్రచారం చేస్తున్నాడు. ఊళ్ళో నెట్వర్క్ సమస్యలు ఉండటంతో ఐదు చోట్ల వైఫై ఏర్పాటు చేశాడు.గ్రామపంచాయతీ పరిధిలో విద్యార్థులకు, యువకులకు నెట్వర్క్ సమస్య వల్ల చాల ఇబ్బందులు ఎదురౌతున్నాయని తన సర్పంచ్ ఎన్నికల హామీలో భాగంగా మొదటిది గ్రామంలో వైఫై నెట్వర్క్ ఏర్పాటు చేసాడు స్వాతంత్ర్య అభ్యర్థి బాలు.

## వారాసిగూడ పవిత్ర హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి..

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ లో వారాసిగూడ బాపూజీ నగర్ బస్తీలో సోమవారం ( డిసెంబర్ 8 ) జరిగిన పవిత్ర హత్య సంచలనం రేపిన సంగతి తెలిసిందే. పెళ్ళికి ఒప్పుకోలేదని అమ్మాయి ఇంటికి వెళ్లి కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు నిందితుడు. ఈ క్రమంలో బుధవారం ( డిసెంబర్ 10 ) మీడియాతో మాట్లాడుతూ పవిత్ర హత్య కేసు విషయంలో సంచలన విషయాలు వెల్లడించారు ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి. ఈ కేసులో నిందితుడు ఉమాశంకర్ ను అరెస్ట్ చేశామని తెలిపారు బాలస్వామి.జగడ లక్ష్మీ కుటుంబం కొన్నేళ్ల క్రితం శ్రీకాకుళం నుండి హైదరాబాద్ కు ఉపాధి నిమిత్తం వచ్చారని.. లేబర్ పని చేస్తూ ఇక్కడే జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. మృతురాలు పవిత్రకు ఆరు నెలల క్రితం నిందితుడు ఉమ శంకర్ తో పెళ్లి నిశ్చయం చేశారని అన్నారు. డిసెంబర్ 8వ తేదీ మధ్యానం పవిత్ర ఉంటున్న ఇంటికి వచ్చిన ఉమ శంకర్ తనతో తెచ్చుకున్న కత్తితో పవిత్ర పై ఉమ శంకర్ దాడి చేశాడని తెలిపారు పోలీసులు.దాడి అనంతరం నిందితుడు పారిపోయాడని.. ఆసుపత్రికి తరలిస్తుండగా పవిత్ర చనిపోయిందని తెలిపారు. తల్లి లక్ష్మీ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు డీసీపీ బాలస్వామి. ఉమ శంకర్ టైల్స్ పని చేస్తున్నాడని.. తాగుడు ఇతర అలవాట్లకు బానిసగా మారడంతో పవిత్ర ఉమాశంకర్ ను వద్దనుకుందని తెలిపారు.ఉమ శంకర్ ప్రవర్తన నచ్చక పవిత్ర అతన్ని దూరం పెట్టగా.. నిందితుడు పవిత్రను చంపాలి అనుకున్నాడని తెలిపారు పోలీసులు. పవిత్రను చంపే ఉద్దేశంతోనే ఉమాశంకర్ పవిత్ర ఇంటికి వచ్చాడని తెలిపారు పోలీసులు. హత్య అనంతరా నిందితుడు వదిలేసినా కత్తిని సీజ్ చేసినట్లు తెలిపారు పోలిసులు. హత్య అనంతరం నిందితుడు పద్మారావు నగర్ లో అతని సోదరుని ఇంటికీ వచ్చాడని... అక్కడే అదుపులోకి తీసుకున్నామని తెలిపారు పోలీసులు.

# కరీంనగర్ జిల్లాలో ఈ మూడు రోజులు.. పబ్లిక్ హాలిడే ప్రకటించిన కలెక్టర్.. తేదీలివే..!

**కరీంనగర్ పెన్ పవర్:** కరీంనగర్ జిల్లాలో గ్రామ పంచాయితీ ఎన్నికలు మూడు విడతల్లో నిర్వహించనున్న క్రమంలో పోలింగ్ జరిగే ప్రాంతాలలో పోలింగ్ రోజున (11.12.2025, 14.12.2025, 17.12.2025) ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ సంస్థలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన కార్యకలాపాలకు ఉపయోగించే ప్రభుత్వ భవనాలు, విద్యా సంస్థల భవనాలు, ఇతర భవనాలకు సంబంధించిన కార్యాలయాలకు పోలింగ్‌కు ముందు రోజు, అలాగే పోలింగ్ రోజు స్థానిక సెలవులు ఉంటాయని పేర్కొన్నారు.

మొదటి విడత ఎన్నికల నిర్వహణ కోసం 10.12.2025(బుధవారం) & 11.12.2025 (గురువారం) స్థానిక సెలవులు, రెండవ విడత ఎన్నికల నిర్వహణ కోసం 13.12.2025 (రెండవ శనివారం), 14.12.2025 (ఆదివారం) సాధారణ సెలవులు, మూడవ విడత






ఎన్నికల నిర్వహణ కోసం 16.12.2025 (మంగళవారం) & 17.12.2025 (బుధవారం) స్థానిక సెలవులు ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ రోజున సెలవు వర్తిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తొలి విడత 20 మండలాల్లో గురువారం పంచాయితీ ఎన్నికల పోలింగ్

398 గ్రామ పంచాయతీలకు 20 సర్పంచ్?లు ఏకగ్రీవం

378 సర్పంచ్ పదవులకు 1524 మంది పోటీ

3682 వార్డులకు 1045 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం

రెండు వార్డులకు దాఖలు కాని నామినేషన్లు

ఎన్నికల నిర్వహించే 2635 వార్డులకు 7320 మంది అభ్యర్థులు పోటీ

తొలి విడతలో పోటీలో ఉన్న 8844 మంది అభ్యర్థుల భవితవ్యం తేల్చనున్న ఆరు లక్షల మంది ఓటర్లు

# పెళ్లి గురించి మాట్లాడదామని ఇంటికి పిలిపించి కొట్టి చంపేశారు.. కూతురిని ప్రేమించాడని బీరంగూడలో ఘాతుకం

**హైదరాబాద్ పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా బీరంగూడలో దారుణం జరిగింది. కూతురును లవ్ చేశాడని తెలిసి.. పెళ్లి గురించి మాట్లాడదామని ఆమె లవర్?ను ఇంటికి పిలిపించి అమ్మాయి తల్లిదండ్రులు అతనిని హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఇంజనీరింగ్ స్టూడెంట్ జ్యోతి శ్రావణ్ సాయిని హత్య చేసిన ఘటన అమీన్‌పూర్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో వెలుగులోకి వచ్చింది. జ్యోతి శ్రావణ్ సాయి(20), బీరంగూడ ఇసుకబావికి చెందిన శ్రీజ (19) గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉండడంతో అమ్మాయి తల్లిదండ్రులు తమ కూతురిని ప్రేమించొద్దని పలుమార్లు సాయిని హెచ్చరించారు. అయినప్పటికీ శ్రావణ్ సాయి, శ్రీజ తమ ప్రేమను కొనసాగించారు. ఈ విషయం శ్రీజ తల్లిదండ్రులకు తెలిసింది. సాయిపై పగ పెంచుకున్న శ్రీజ ఫ్యామిలీ ఇద్దరికీ మ్యారేజీ చేస్తామని, మాట్లాడుకుందామని అతనిని ఇంటికి పిలిపించారు. ఇంటికి పిలిచి



ఒక్కసారిగా సాయిపై దాడి చేశారు. విచక్షణా రహితంగా అతనిని కొట్టడంతో శ్రావణ్ సాయికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ ఇంట్లోకి లాక్కెళ్లి మరీ దాడి చేశారు. దెబ్బలకు తాళలేక విలవిలలాడిపోయిన శ్రావణ్ సాయి ప్రాణాలు కోల్పోయాడు. జ్యోతి శ్రావణ్ సాయి మైసమ్మ గూడలోబి సెయింట్ పీటర్ కాలేజీలో బీటెక్ సీఎస్ఈ సెకండియర్ చదువుతున్నాడు. కుత్బుల్లాపూర్‌లో

రూం తీసుకుని జ్యోతి శ్రావణ్ సాయి ఉంటున్నాడు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్ చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అమీన్ పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీవారి భక్తులకు అలర్ట్: తిరుమలలో డిసెంబర్, జనవరి నెలల్లో ఈ తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు..

**హైదరాబాద్ పెన్ పవర్:**డిసెంబర్, జనవరి నెలలకు సంబంధించి వీఐపీ దర్శనాల విషయం లో కీలక నిర్ణయం తీసుకుంది టీటీడీ. ఈ నెలల్లో పర్వదినాల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది టీటీడీ. ఆయా రోజుల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది టీటీడీ.డిసెంబర్ 23న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, వైకుంఠ ఏకాదశి ముందు రోజైన డిసెంబర్ 29వ తేదీ డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వైకుంఠ దర్శనాలు, జనవరి 30న రథసప్తమి కారణంగా ప్రోటోకాల్ ప్రముఖులు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు తెలిపింది టీటీడీడిసెంబర్, జనవరి నెలల్లో పర్వదినాల ముందురోజు వీఐపీ దర్శనాల కు సంబంధించిన సిఫార్సు లేఖలు స్వీకరించబడవని తెలిపింది టీటీడీ. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని సహకరించాల్సిం దిగా భక్తులను కోరింది టీటీడీ. ఇదిలా ఉండగా.. తిరుపతిలో డిసెంబర్ 16 నుంచి 2026 జనవరి 16 వరకు ధనుర్మాస తిరుప్పావై ప్రవచనాల కార్యక్రమం నిత్వహించనున్నట్లు తెలిపింది టీటీడీ. తిరుపతితో పాటు దేశవ్యాప్తంగా 233 కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపింది టీటీడీ. ధనుర్మాసం సందర్భంగా దేశవ్యాప్తంగా 233 కేంద్రాల్లో ప్రముఖ పండితులు తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారని తెలిపింది టీటీడీ. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తిరుపతితో పాటు ఏపీలో 76, తెలంగాణ 57, తమిళనాడు- 73, కర్ణాటక- 21, పాండిచ్చేరి- 4, న్యూఢిల్లీ, ఒడిశాలో ఒకొక్క కేంద్రంలో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించనున్నట్లు తెలిపింది టీటీడీ. తిరుమలలో కూడా ధనుర్మాసంలో సుప్రభాతం బదులుగా తిరుప్పావై నివేదించడం విశేషం.

# డేటాతో రండి......ఇండిగోకు డీజీసీఏ బులావ్...

**హైదరాబాద్ పెన్ పవర్:**వరద ఆగింది...బురద మిగిలింది...ఇండిగో ఘటన అచ్చం ఇలాంటిదే. అర్ధాంతరంగా సాంకేతిక సమస్యలంటూ దాదాపు 550 విమానాలను రద్దు చేసి విమానయాన చరిత్రలోనే రికార్డు సృష్టించిన ఇండిగోపై ఇపుడు పోస్ట్ మార్టం షురూ అయ్యింది. నిజంగా సాంకేతిక సమస్యలా...లేదా కావల్సిగా చేశారా? కొత్త నిబంధనల్ని కేంద్రం బేషరతుగా వెనక్కి తీసుకునేందుకే ఈ కుట్ర పన్నారా? ప్రయాణికులకు రీఫండ్ చేశారా? వారి వేదనను తగ్గించారా? ఈ విషయాలపై సంబంధిత శాఖ ఆరా తీయడం మొదల్టెంది. ఈ నేపథ్యంలోనే ఇండిగో సీఈవో పీటర ఎల్బర్ట్స్ ఇతర విభాగాల అధికారులు అన్ని వివరాల డేటాతో ఈనెల 11న కార్యాలయానికి హాజరు కావల్సిందిగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ తాకీదులిచ్చింది. ఇండిగో విమానాల రద్దు పెద్ద సంక్షోభంగా మారడంతో ఆ సెగలు కేంద్రాన్ని తాకాయి. అసలే పార్లమెంట్ శీతాకాల సమావేశంలో ప్రతిపక్షం గరం గరంగా ఉంటుంటే...ఈ వివాదం మంచి ఆయుధంగా దొరికింది. విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడిని దుమ్ముదులిపి వదలిపెట్టారు. కేంద్రం ఒకపక్క ప్రతిపక్షానికి దీటుగా సమాధానాలు ఇస్తూనే మరో పక్క నష్టనివారణ చర్యలు చేపట్టింది. కేంద్ర మంత్రి పార్లమెంట్ లో ఇండిగో పై మాట్లాడితే...ఇదో పోస్ట్ మార్టం రిపోర్ట్ లా ఉందని ప్రతిపక్షం ఎద్దేవా చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్రం ఇండిగోపై గుర్రుగా ఉంది. అప్పుడే ఆ సంస్థపై కొరడా




ఝుళిపించడం ప్రారంభించింది. మొదటి చర్యగా దాని స్లాటుల్లో భారీ కోత విధించింది. తాజాగా డీజీసీఏ వివరాలతో హాజరు కావల్సిందిగా ఆదేశించింది.

డీజీసీఏ ఆదేశాల ప్రకారం ఇండిగో సీఈవో, సంబంధిత విభాగాల సీనియర్ అధికారులు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు డీజీసీఏ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలి. విమానల సర్వీసుల్లో అంతరాయానికి సంబందించి పూర్తిస్థాయి డేటా, అప్ డేట్ వివరాలు, నివేదికతో సిద్ధంగా ఉండాలని అని డీజీసీఏ ఆదేశించింది. సిబ్బంది నియామకాల ప్లాన్, పైలట్లు, కేబిన్ సిబ్బంది వివరాలు, రద్దయిన విమానాల సంఖ్య, ఎంతమేరకు ప్రయాణికులకు రీఫండ్ చేశారు తదితర సమాచారాన్ని కచ్చితమైన వివరాలను గణాంకాలతో సహా సిద్ధం చేసుకుని తీసుకు రావాలని డీజీసీఏ కార్యాలయం హుకూం జారీ చేసింది. ఇండిగో విమానాల రద్దు ఘటనపై ఇప్పటికే డీజీసీఏ నలుగురు సభ్యలతో కమిటీ ఏర్పాటు చేసింది. కమిటీ నివేదిక ఆధారంగా సంస్థపై కచ్చితంగా చర్యలుంటాయని పౌర విమానాయాన శాఖ స్పష్టం చేసింది. కాగా కచ్చితమైన వివరాల సేకరణకు మరింత సమయం కావాలని ఇండిగో సంస్థ అభ్యర్థించింది. ఇప్పటికే ఇండిగో సీఈవో కు డీజీసీఏ షోకాజ్ నోటీసు జారీ చేసింది.

# అమీర్ పేట్, మైత్రివనం ఏరియాల్లో ఉంటున్న పబ్లిక్‌కు ఈ సంగతి తెలుసా..?



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్: గడచిన వర్షా కాలంలో.. జూబ్లీ హిల్స్, వెంకటగిరి, రహ్మత్ నగర్, యూసుఫ్ గూడ ప్రాంతాల నుంచి కృష్ణకాంత్ పార్క్ మీదుగా పారే కాలువ గాయత్రి నగర్ వద్ద ఉన్న నాలాలో కలవడం, ఈ ప్రాంతాలతో పాటు మధురానగర్, శ్రీనివాస్ నగర్ వెస్ట్ నుంచి భారీగా వరద రావడంతో అమీర్ పేట్, మైత్రివనం ప్రాంతాలు ముంపునకు గురైన సంగతి తెలిసిందే. అమీర్ పేట్, మైత్రీ వనం, సికింద్రాబాద్ ప్యాట్నీ నాలాల్లో విస్తరణ క్లియరెన్స్‌తో వరద ముప్పు తగ్గింది. ఈ విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. హైదరాబాద్?లో చేపట్టనున్న నాలాల డీ సిల్టింగ్ పనులపై జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో హైడ్రా కో ఆర్డినేషన్ మీటింగ్ జరిగింది. వరద ముప్పులేని నగరం అందరి లక్ష్యం కావాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పిలుపునిచ్చారు. ఏప్రిల్ నాటికి నగరవ్యాప్తంగా డీసిల్టింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అసాధారణ వర్షపాతం వచ్చినప్పుడు కూడా వరద నీరు సాఫీగా సాగేలా అందరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. జనవరి నుంచి అన్ని నాలాల్లో డీసిల్టింగ్ పనులు ప్రారంభించాలని.. స్థానికులు, ప్రజాప్రతినిధులను పర్యవేక్షణలో భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు. నాలాల్లో పూడిక తొలగింపులో ఎలాంటి రాజీ ఉండదని కమిషనర్ స్పష్టం చేశారు.

కాంట్రాక్టర్లు చెప్పే మాటలు వినకుండా.. ఎక్కడ పూడిక ఉంటే అక్కడ పూర్తిగా తొలగించాలని.. వందలాది మంది సిబ్బంది సమస్య పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. పూడిక తొలగింపు మాత్రమే కాదని.. నాలాల నిర్వహణకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ సూచించారు.

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు ఫ్రీ బస్సులు.. ఎక్కడెక్కడి నుంచి అంటే..




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు ఫ్రీ బస్సులు నడపనున్నట్లు తెలిపింది TGSRTC. గురువారం ( డిసెంబర్ 11 ) నుండి శనివారం ( డిసెంబర్ 13 ) వరకు భారత్ ఫ్యూచర్ సిటీకి వెళ్లేందుకు గ్రేటర్ హైదరాబాద్ లోని వివిధ ఏరియాల నుంచి ఉచిత బస్సులు నడపనున్నట్లు తెలిపింది టీజీఎస్ఆర్టీసీ. ఈ ఉచిత బస్సులు MGBS, JBS, మియాపూర్, గచ్చిబౌలి, ఎల్.బి. నగర్, ఉప్పల్, శంషాబాద్ నుండి ఉదయం 9, 10, 11,12 గంటలకు బయలుదేరతాయని తెలిపింది. తిరిగి ఉదయం బయలుదేరిన ప్రాంతాలకు ఫ్యూచర్ సిటీ నుంచి సాయంత్రం 4,5,6,7 గంటలకు బయలు దేరుతాయని తెలిపింది టీజీఎస్ఆర్టీసీ. నగరవాసులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉచిత బస్సులను వినియోగించు కోవాలని విజ్ఞప్తి చేశారు అధికారులు. మరిన్ని వివరాలకు 959226160 నెంబరును సంప్రదించ వచ్చని తెలిపారు అధికారులు. ఇదిలా ఉండగా.. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్? వేదికగా రాష్ట్ర చరిత్రలోనే భారీగా పెట్టుబడులు వచ్చాయి. రెండు రోజుల సమిట్?లో ఏకంగా రూ. 5 లక్షల 75 వేల కోట్ల విలువైన ఒప్పందాలు కుదిరినట్లు ప్రభుత్వం ప్రకటించింది. తొలిరోజు సోమవారం రూ. 2 లక్షల 43 వేల కోట్ల పెట్టుబడులు రాగా.. రెండో రోజు అది మరింత పెరిగింది. మంగళవారం ఒక్కరోజే రూ. 3 లక్షల 32 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వం వెల్లడించింది. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఇంధన, ఐటీ, పర్యాటక, ఫార్మా రంగాల దిగ్గజాలు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. రెండో రోజు వచ్చిన పెట్టుబడుల్లో విద్యుత్? రంగం సింహభాగంలో నిలిచింది. జెన్‌కో, రెడ్‌కో సంస్థలతో కుదిరిన ఒప్పందాలే దాదాపు రూ. 3 లక్షల కోట్లుగా ఉన్నాయి.

## నైజాంలో అఖండ2 బుకింగ్స్ ఓపెన్.. ప్రీమియర్ షో టికెట్లు హైదరాబాద్?లో ఇంకా ఎందుకు ఓపెన్ అవలేదంటే..

**హైదరాబాద్ పెన్ పవర్:** నైజాంలో అఖండ2 బుకింగ్స్ ఓపెన్ కావడంతో బాలయ్య అభిమానులు ఫుల్ జోష్?లో ఉన్నారు. తెలంగాణలో అఖండ-2 సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు ధరలను ప్రకటిస్తూ జీవో జారీ చేసింది. డిసెంబర్ 12న దేశవ్యాప్తంగా విడుదలవుతున్న అఖండ2 సినిమా ప్రీమియర్స్ 11న రాత్రి 9 గంటలకే పడనున్నాయి.

డిసెంబర్ 11న రాత్రి 9 గంటలకు ప్రదర్శించే ప్రీమియర్ షో ధర 600 రూపాయలకు అమ్ముకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. డిసెంబర్ 12 నుంచి 14 వరకు మల్టీప్లెక్స్‌ల్లో రూ.100 పెంపు, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్‌పై రూ.50 పెంచుకునేందుకు రేవంత్ సర్కార్ అనుమతినిచ్చింది. అఖండ2 సినిమా రిలీజ్ కష్టాలను దాటుకుని విడుదలవుతున్న సంగతి తెలిసిందే. 14 రీల్స్ ప్లస్ నిర్మాణంలో తెరకెక్కిన ఈ సినిమా డిసెంబర్ 5నే విడుదల కావాల్సి ఉండగా.. Erosతో వివాదం.. ఫైనాన్స్ కష్టాలు ఎదురవడంతో విడుదల వాయిదా పడింది. ఈ వివాదాలను పరిష్కరించుకుని డిసెంబర్ 12న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. డిసెంబర్ 11న రాత్రి 9 గంటలకు తెలుగు రాష్ట్రాల్లో ప్రీమియర్ షోతో అఖండ2 తాండవం మొదలవుతోంది. బోయపాటి, బాలకృష్ణ కాంబోలో వచ్చిన అఖండ సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమాకు సీక్వెల్‌గా అఖండ 2 సినిమా తెరకెక్కింది. అఖండ 2 తాండవం రిలీజ్ టీజర్‌ను చిత్ర బృందం తాజాగా విడుదల చేసింది. థమన్ బీజీఎం ఈ సినిమాకు మరోసారి హైలైట్‌గా నిలిచేలానే కనిపిస్తోంది. ఈ సినిమాలో బాలయ్య సరసన సంయుక్త మీనన్ స్టెప్పులేసింది. బుక్ మై షో, డిస్ట్రిక్ట్ వెబ్ సైట్స్‌లో ప్రస్తుతానికి డిసెంబర్ 12న ఉదయం షోల నుంచి టికెట్లను అందుబాటులో ఉంచారు. డే1 బుకింగ్స్ కంప్లీట్ అయిన తర్వాత డిసెంబర్ 11న రాత్రి 9 గంటల షో టికెట్లను అందుబాటులో ఉంచే అవకాశం ఉంది.


# జగిత్యాల జిల్లాలో యాక్టివా ఇంజిన్ నుంచి పొగ... మంటల్లో పూర్తిగా దగ్ధం..



**హైదరాబాద్ పెన్ పవర్:** జగిత్యాల జిల్లాలో యాక్టివా స్కూటీ మంటల్లో దగ్ధమయ్యింది. ఒక్కసారిగా ఇంజిన్ నుంచి పొగ వచ్చి మంటలు చెలరేగి దగ్ధమైంది యాక్టివా. బుధవారం ( డిసెంబర్ 10 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం మద్దునూరులో చోటు చేసుకుంది ఈ ఘటన. బుగ్గారం మండలంలో యాక్టివా 6%+% స్కూటీ నడుస్తుండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగి దగ్ధమైంది. ఇంజిన్ నుంచి పొగ రావడంతో కొద్దిసేపట్లోనే మంటలు పూర్తిగా వ్యాపించాయి. మంటల్లో స్కూటీ పూర్తిగా దగ్ధమయ్యింది. ఈ ఘటనలో స్కూటీ ఓనర్ ప్రాణాలతో బయటపడ్డారు. స్కూటీ దగ్ధమవ్వడానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఎలక్ట్రిక్ వాహనాలు తగలబడటం గురించి వార్తలు తరచూ వింటుంటాం కానీ.. పెట్రోల్ వాహనం, అందులోనూ శీతాకాలంలో మంటలు చెలరేగడం ఆశ్చర్యాన్ని కలిగించే విషయమని చెప్పాలి.

# ఫ్యూచర్ సిటీని గుజరాత్ గిఫ్టు సిటీలా ప్లాన్ చేయొచ్చుగా రేవంత్?


**హైదరాబాద్ పెన్ పవర్:** కలలు కనటం వేరు. వాటిని నెరవేర్చుకోవటం వేరు. అత్యున్నత స్థానంలో ఉన్నా.. అధికారం చేతిలో ఉన్నా అన్నీ అనుకున్నట్లుగా చేయటం అంత తేలికైన విషయం కాదు. కానీ.. అలాంటి సవాళ్లను ఎదుర్కొని మరీ తాను కల కన్న ఫ్యూచర్ సిటీకి ఒక గుర్తింపు వచ్చేలా.. అంతర్జాతీయంగా ఫ్యూచర్ సిటీ గురించి మాట్లాడుకునేలా చేయటంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ సక్సెస్ అయ్యారనే చెప్పాలి. గడిచిన రెండు రోజులుగా నిర్వహించిన ఫ్యూచర్ సిటీకి సంబంధించి పరిణామాలు.. లక్షలాది కోట్ల రూపాయిలు పెట్టుబడుల రూపంలో వెల్లువెత్తిన తీరు చూసినప్పుడు ఫ్యూచర్ సిటీ దిశగా అడుగులు మరింత వడవడిగా పడతాయని చెప్పాలి. ఇలాంటి సమయంలోనే ఫ్యూచర్ సిటీ ఎలా ఉండాలి? దాన్నెలా నిర్మించాలన్న దానిపై ప్లాన్ చేసే సమయంలో చప్పున గుర్తుకొచ్చేది గుజరాత్ లోని గిఫ్టు సిటీ. ప్రపంచ వ్యాపారం కోసం దేశంలో నిర్మించిన మొట్టమొదటి స్మార్ట్ సిటీ. గుజరాత్ రాజధాని గాంధీనగర్ – అహ్మదాబాద్ మధ్య సబర్మతీ నదిని అనుకొని 886 ఎకరాల్లో ఏర్పాటైన గిఫ్ట్ సిటీ అత్యాధునిక టెక్నాలజీ.. వసతులతో అందరిని విపరీతంగా ఆకర్షిస్తోంది. అక్కడి పరిస్థితులు.. మౌలిక సదుపాయాలకు సంబంధించిన వివరాలు తెలిసినప్పుడు విస్మయానికి గురి కాకుండా



ఉండలేం. తెలంగాణ సీఎం రేవంత్ కలలు కంటున్న ఫ్యూచర్ సిటీని గిఫ్టు సిటీ మోడల్ ను ఫాలో అయితే.. బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇంతకూ గుజరాత్ గిఫ్టు సిటీలో ఏముంటుంది? అన్న విషయంలోకి వెళితే.. అక్కడున్న పరిస్థితుల గురించి చదవినప్పుడు నమ్మశక్యం కాని రీతిలో ఉంటాయని చెప్పకతప్పదు. డ్రైనేజీ పైపు లైన్ కనిపించకపోవటం.. కరెంట్ వైర్లు బయటకు కనిపించకుండా ఉండే వ్యవస్థలు అక్కడి సొంతం. ఈ గిఫ్టు సిటీలో దేశంలోనే తొలి ఆటోమేటెడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ సిస్టమ్ ఉంది. పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించే అవసరం లేకుండా ప్రత్యేక పైప్ లైన్ ద్వారా పెద్ద పెద్ద భవనాల్లోని అంతస్తుల నుంచే నేరుగా చెత్తను పైప్ లైన్ ద్వారా సేకరిస్తారు. అదెలా అంటే వాక్యూమ్ తో. చెత్త సేకరణకు ఎలా అయితే ప్రత్యేక పైప్ లైన్ వ్యవస్థను ఏర్పాటు చేశారో అదే విధంగా మంచినీరు.. విద్యుత్ సరఫరా కోసం అతి పెద్ద అండర్ గ్రౌండ్ పైప్ లైన్ వ్యవస్థను తీసుకొచ్చారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్.. డ్రైనేజీ వాటర్ ను శుద్ధి చేసే ప్లాంట్ ఉన్నాయి. నాన్ స్టాప్ గా కరెంట్ సప్లై అయ్యే వ్యవస్థల్ని సిద్ధం చేశారు. శుద్ధి చేసిన మురుగు నీటిని 5 డిగ్రీలకు శీతలీకరించి.. వాటిని నగరంలో ఎయిర్ కండిషనింగ్ కోసం వాడతారు. దీంతో ఈ సిటీలో ఏసీ ఔట్ డోర్ యూనిట్లు మచ్చుకు కూడా ఉండవు. ఈ కూల్ పైప్ లైన్ ద్వారా ప్రతి భవనానికి ఎయిర్ కండిషనింగ్ ఉంటుంది. దీంతో సిటీ మరింత సుందరంగా.. కాలుష్యం అంత ఎక్కువ లేకుండా చేస్తుంది. సాధారణ ఏసీలు పని చేసే కన్నా.. ఈ భిన్నమైన కూలింగ్ సిస్టమ్ తో విద్యుత్ వినియోగం కూడా తక్కువేనని చెబుతున్నారు. ఇవన్నీ చదివిన తర్వాత తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ కలల నగరమైన ఫ్యూచర్ సిటీని ఇదే తీరులో నిర్మిస్తే బాగుండన్న భావన కలుగక మానదు. మరి.. ఈ విషయాలు ముఖ్యమంత్రికి తెలిసేలా ఎవరో ఒకరు నడుం బిగిస్తే.. ఫ్యూచర్ సిటీ మరో గిఫ్టు సిటీలా మారుతుందని చెప్పకతప్పదు.

# లక్షల కోట్లు...జాబ్స్ నిల్...ఏంది ఈ గోల !

**హైదరాబాద్ పెన్ పవర్:** అవును నిజమే కదా. ఏ రాష్ట్రం చూసినా ఏమున్నది గర్వకారణం అంటే లక్షల కోట్ల పెట్టుబడులు ఇట్టే వచ్చేస్తున్నాయి. అంతే కాదు రెండు రోజుల సమ్మిట్ పెడితే చాలు ఇన్వెస్టర్లు వెల్లువలా తరలి వస్తున్నారు. వేల కోట్ల పెట్టుబడులతో ఆ రాష్ట్రాన్ని సుసంపన్నం చేస్తున్నారు. ప్రతీ ఒక్క ప్రాజెక్టు విషయంలోనూ ఎన్నో జాబ్స్ వస్తాయని పాలకులు చెబుతున్నారు. అయితే నిజంగా అలాగే జరుగుతోందా అసలు ఈ పెట్టుబడులు సదస్సులు ఏమిటి అందులో గ్రౌండ్ అయ్యేవి ఎన్ని అసలు కొసరు తీసేస్తే జాబ్స్ అని వచ్చేవి ఎన్ని అన్నది అంతటా సాగుతున్న చర్చగా ఉంది.



**ఎన్ని సమ్మిట్స్ చూడలేదు :**

ఈ గాలి ఈ నేల ఎన్ని సమ్మిట్స్ చూడలేదు, కాలాలు మారుతున్నాయి, కేలండర్లు గిర్రున తిరుగుతున్నాయి, అయినా కానీ ఈ సమ్మిట్స్ వల్ల పారిశ్రామిక విప్లవం రాలేదే, అంతే కాదు నిరుద్యోగం పోలేదే, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగానే కదా పరిస్థితి ఉంది అన్నది సగటు జనం వేదనగా ఉంది. ఇక కాస్తా వెనక్కి వెళ్తే తెలంగాణాలో కేసీఆర్ టైం లో కానీ రేవంత్ రెడ్డి టైంలో కానీ ఇన్వెస్టర్స్ సమ్మిట్స్ ఎన్నో జరిగాయి. ఇక ఏపీలో అయితే చంద్రబాబు ఆ తరువాత వైఎస్ జగన్ మళ్ళీ చంద్రబాబు 2024లో పవర్ లోకి వచ్చాక సమ్మిట్స్ జరుగుతూనే ఉన్నాయి. ఈ సమ్మిట్స్ లో ఏకంగా వేలు కాదు లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని తెగ ఊదరగొట్టడం తప్ప ఆచరణలో జరిగింది ఏమిటి అన్నది కూడా అంతా సీరియస్ గానే ఆలోచిస్తున్న విషయంగా ఉందిపుడు.

**ఒప్పందాల కథ ఏంటో :**

ఇలా జరుగుతున్న సమ్మిట్స్ ని చూసి వాటి మీద చేస్తున్న ఆర్భాటం ప్రచారం చూసిన వారు అనుకునే మాట ఏంటి అంటే ఈ ఒప్పందాల వెనక ఉన్న కథ ఏంటి అని. నిజంగా ఒప్పందం ఒక ప్రభుత్వం తో పారిశ్రామిక సంస్థలు చేసుకుంటే అవి కచ్చితంగా అమలు జరిగి తీరాలి కదా. ఎందుకు అంటే అక్కడ ఉన్నది బలమైన ప్రభుత్వం. ప్రభుత్వంతో ఎవరూ మోసం చేసేది ఉండదు, కానీ జరుగుతున్నదేంటి, లక్షల ఒప్పందాలు అంటే అందులో పదవ వంతు అయినా గ్రౌండ్ కావాలి కదా అన్నదే అందరిలో వస్తున్న ఆలోచనగా ఉంది. అయితే అంతా అనుకుంటున్నది ఏంటి అంటే ఫేక్ ఎంఓయూలు ఏమైనా జరుగుతున్నా యా అని పెద్ద ఎత్తున చర్చ అయితే సాగుతోందిట. ఎందుకు అంటే ఎవరికీ జాబ్స్ అయితే ఈ సమ్మిట్స్ వల్ల వచ్చినది అయితే లేదు అని అంటున్నారు.

**వైట్ పేపర్ రిలీజ్ చేయాలి :**

ప్రభుత్వం అంటే కోట్లాది మంది ప్రజలకు సంబంధించినది. వారి తల రాతలను రాసేది, వారికి మంచి భవిష్యత్తుని ఇచ్చేది. అలాంటి ప్రభుత్వం ఒక కార్యక్రమం చేస్తే దాని వల్ల ప్రజలకు ఎంతో మేలు జరగాలి. కానీ జరుగుతున్నది చూస్తే కేవలం ప్రచారంగానే అంతా మిగులుతోంది. అందుకే నిజాయతీగా పారదర్శకంగా ప్రజలకు అన్ని విషయాలు చెప్పాల్సి ఉంది అని అంటున్నారు. దాని కోసం ఈ సమ్మిట్స్ వల్ల ఎన్ని జాబ్స్ వచ్చాయి అన్నది వైట్ పేపర్ రిలీజ్ చేయాలని ప్రభుత్వాలు ఆ విధంగా ప్రజలకు తాము అసలైన జవాబుదారీగా ఉన్నామని రుజువు చేసుకోవాలని అంతా కోరుతున్నారు. వైట్ పేపర్ కావాలని నిరుద్యోగ యువత చర్చిస్తోంది. అలాగే కోరుతోంది కూడా.

**మీడియా హడావుడి :**

ఇక చూస్తే ఏదో టీవీలలో హడావుడి చేయడమే కానీ రియల్ గా చూస్తే గ్రామాలలో ఈ తరహా సమ్మిట్స్ విషయంలో పెద్దగా చర్చ అయితే జరగడం లేదు అని అంటున్నారు. ఎకానమీ గ్రోత్ అనేది గ్రామీణ ప్రాంతాలలో ఉన్న జనాభా తోనే సాధ్యం అవుతుంది అని అంటున్నారు. మనది ఎక్కువగా వ్యవసాయిక ప్రాంతం కాబట్టి ఆ విధంగా ప్రాజెక్టులు కానీ సంస్థలు కానీ వస్తేనే రూరల్ ఎకానమీ పెరుగుతుంది. ఉపాధి దొరుకుతుంది. జాబ్స్ కూడా ఆయా సెక్టార్లలో వస్తాయని మేధావులు అంటున్నారు. రూరల్ సెక్టార్ లో ఉన్న అగ్రికల్చర్ ప్రొడక్ట్స్ ని ఎగుమతి చేయడం ద్వారానే ఎకానమీని పెంచుకోవచ్చు అని అంటున్నారు. కేవలం పట్టణాలలో ఉన్న సర్వీస్ బేస్డ్ ఎగుమతి వల్ల అయితే పెద్దగా ఉపయోగం లేదని కూడా ఆర్థిక నిపుణులు అంటున్నారు.

**ప్రచారం కంటే కూడా :**

ఇవన్నీ పాలకులు గమనంలోకి తీసుకోవాలి తప్ప సమ్మిట్ పేరుతో హడావిడి చేయడం పేపర్స్ లో టీవీలలో ప్రచారం కల్పించడం అలగే భారీ హోర్డింగ్స్ ని నగరాలలో పెట్టేసి ఇన్నేసి లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని చెప్పుకుంటే ఎకనామీ గ్రోత్ ఎలా సాధ్యమని అంటున్నారు. రూరల్ బేస్డ్ సెక్టార్ కి ఊతమిస్తూ ఆ దిశగా వచ్చే పరిశ్రమలకు స్వాగతం పలకడం వాటి ద్వారానే ఆర్థికంగా కానీ ఉపాధి పరంగా కానీ సాధించగలమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ సగటు చెప్పొచ్చేది ఏమిటి అంటే ఒప్పుడు సమ్మిట్ అన్నది అందమైన పదం, ఒక బ్రహ్మ పదార్ధంగా ఉండి అట్రాక్ట్ చేసేది, ఇపుడు అందరూ నిర్వహిస్తూ దానిని రాజకీయంగా వాడుకుంటున్నారా లేక జనాలను మభ్యపెట్టేందుకు చేస్తున్నారా అంటే మాత్రం ఆలోచించుకోవాల్సిందే మరి.

# కవితకు ఇచ్చి పారేస్తున్న గులాబీ దళం

**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ స్ నీడలో కేసీఆర్ కుమార్తె హోదాలో ఉన్నపుడు కవిత అంటే గులాబీ దళం మొత్తం ఎంతో గౌరవించేది. ఆమె తమ పార్టీ అధినేత తనయ అని ఎంతో మర్యాద ఇచ్చేది. కానీ కాలం మారింది. కవిత బీఆర్ఎస్ కి దూరం అయింది. దాంతో ఆమె ఇపుడు తెలంగాణా జాగృతి నాయకురాలిగా జనంలో తిరుగుతున్నారు. అయితే అక్కడే తేడా వస్తోంది. ఆమెను నిన్నటిదాకా పొగిడిన నోళ్ళే ఇపుడు తెగుడుతున్నాయి. కవితని తీవ్ర స్థాయిలో విమర్శించడానికి ఏ మాత్రం వెనకాడడం లేదు అంటే రాజకీయాలు అంటే ఇలాగే ఉంటాయని కేసీఆర్ ఇంటి ఆడబిడ్డకు ఈ పాటికి అర్థం అయి ఉంటాయని అంటున్నారు.



**బీఆర్ఎస్ టార్గెట్ గా :**

ఇక జిల్లాల పర్యటన పేరుతో జనంలోకి వచ్చిన కవిత బీఆర్ఎస్ నే గట్టిగా టార్గెట్ చేస్తున్నారు. ఏ ప్రాంతం వెళ్లినా ఏ జిల్లా వెళ్ళినా ఆమె అక్కడ ఉన్న స్థానిక బీఆర్ఎస్ నాయకత్వాన్ని విమర్శిస్తున్నారు. నిజానికి బీఆర్ఎస్ అధికారం పోయి రెండేళ్ళు దాటింది. తెలంగాణాలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఏమైనా అంటే గింటే కాంగ్రెస్ పాలన మీద విరుచుకుపడాలి కానీ కవిత ఆలోచనలు ఏమిటో తెలియదు కానీ బీఆర్ఎస్ మీదనే తన బాణాలను ఎక్కుపెడుతున్నారు. దాంతోనే గులాబీ దళానికి ఎక్కడ లేని కోపం వస్తోంది. వారు తిరిగి కవిత అన్న దానికి వడ్డీలతో సహా అప్పగిస్తున్నారు.

**ఘాటుగానే :**

ఇప్పటిదాకా కవితను ఎవరూ అనని తీరులోనే గులాబీ దండు నుంచి విమర్శలు వస్తున్నాయని అంటున్నారు ఆమెని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి లిక్కర్ రాణి అని ఘాటుగా విమర్శించారు. ఇక ఆమె తాజాగా కూకట్ పల్లి పర్యటనలో బీఆర్ఎస్ నేతలను ఎవరినీ వదలలేదు. మల్లారెడ్డి నుంచి బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు మాజీల మీద కూడా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు దానికి బదులు అన్నట్లుగా బీఆర్ఎస్ కి చెందిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కవితకు బదులిచ్చారు. ఆమె మీద తీవ్రమైన కామెంట్స్ చేశారు.

**బండారం మొత్తం అంటూ :**

తమ మీద అదే పనిగా కవిత విమర్శలు చేస్తూ పోతే ఆమె బండారం మొత్తం బయటపెడతామని మాధవరం క్రిష్ణారావు హెచ్చరించడం విశేషం. అంతే కాదు బీఆర్ఎస్ లో ఉన్నపుడు ఆమె చాలానే చేశారు అని కూడా ఆయన లోగుట్టు చెప్పే ప్రయత్నం చేశారు. కవిత విషయంలో తాము ఇంతకాలం ఆగామంటే కేసీఆర్ మీద అభిమానంతో మాత్రమే అని అన్నారు. తాము కూడా అన్నీ ఇక మీదట ఒక్కోటిగా బయటపెట్టాల్సి వస్తుందని ఆయన చెప్పడం విశేషం.

**బీఆర్ఎస్ కి ట్రబుల్ :**

కేసీఆర్ కుమార్తెగానే జనంలో అందరికీ కవిత తెలుసు. దాంతో పాటు బీఆర్ఎస్ లో కీలక నేతగా ఆమె నిన్నటి వరకూ ఉన్నారు. అలాంటి ఆమె బీఆర్ఎస్ మీదనే విమర్శలు చేస్తూంటే జనంలో ఆ పార్టీ ఇబ్బందులలో పడుతోంది అని గులాబీ దళం భావిస్తోంది. అంతే కాదు స్థానిక సంస్థల ఎన్నికలు ముంగింట్లో ఉన్నాయి. ఇవి పార్టీకి కీలకంగా మారుతున్న వేళ ఈ విమర్శలు జనంలోకి వెళ్తే పార్టీ మరింతగా ఇబ్బందులో పడుతుందని భావిస్తున్నారు. అందుకే కవిత మీద గులాబీ నేతలు గట్టిగా మాట్లాడుతున్నారు. ఆమె కేసీఆర్ కుమార్తె అని ఆలోచిస్తే పార్టీ మొత్తానికి ముప్పు అని వారు గ్రహించడం వల్లనే ఇలా చేస్తున్నారు అని అంటున్నారు మొత్తానికి కవిత బీఆర్ఎస్ మీద విమర్శలు అపాలన్నది గులాబీ నేతల సందేశం. ఆమె ఇంకా దూకుడు చేస్తే ఇచ్చి పడేసేందుకు వారు రెడీగానే ఉన్నారని అంటున్నారు.

# సిద్ధరామయ్య దిగితే...రేవంత్ రెడ్డి కూడా దిగాలా ?

**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్ కి దేశంలో ఉన్నది మూడంటే మూడు రాష్ట్రాలు. అందులో హిమాచల్ ప్రదేశ్ చిన్న రాష్ట్రం అయితే దక్షిణాన ఆ పార్టీకి ఉన్నది తెలంగాణా అలాగే కర్ణాటక. ఈ రెండు రాష్ట్రాలలో 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఒక విధంగా కాంగ్రెస్ కి అచ్చివచ్చిన ఏడాదిగా 2023 ఉంది. ఇక కర్ణాటకలో కానీ తెలంగాణలో కాంగ్రెస్ కానీ అధికారం అయితే దక్కింది కానీ సీఎం రేసులో చాలా మంది అక్కడా ఇక్కడా కూడా ఉన్నారు. ఇక కర్ణాటకలో సిద్ధరామయ్య డీకే శివకుమార్ ల మధ్య ఒక రేంజిలో పోటీ నడచింది. తెలంగాణాలో అంత కాకపోతే సీనియర్ నేతలు చాలా మంది సీఎం సీటు మీద ఆశలు పెట్టుకుని హైకమాండ్ చేసిన సర్దుబాటుతో వెనక్కి తగ్గారు. ఇపుడు చూస్తే అక్కడ రెండున్నరేళ పాలన తెలంగాణాలో రెండేళ్ళ పాలన పూర్తి అయ్యాయి. కాంగ్రెస్ కల్చర్ ప్రకారం చూస్తే ఏడాదికి ఒక సీఎం మారాలి. కానీ అంతకంటే ఎక్కువ కాలమే అయింది. కాబట్టి వేచి చూసే ఓపిక లేని వారు అంతా సీన్ లోకి వస్తున్నారు. కర్ణాటకలో అయితే ఏకంగా సిద్ధరామయ్య డీకే శివకుమార్ ల మధ్యన చెరి రెండున్నరేళ్ళ పాటు సీఎం పోస్టు అన్న ఒప్పందం కూడా కాంగ్రెస్ అధినా యకత్వం కుదిరించింది అని ప్రచారం అయితే ఉంది.

**కర్ణాటక ఫార్ములాతో :**

ఇక కాంగ్రెస్ లో ఇపుడు చూస్తే కర్ణాటక ఫార్ములాతో తలకాయ నొప్పి వస్తోంది అని అంటున్నారు. అక్కడ సిద్దరామయ్య దిగితే డీకే శివకుమార్ సీఎం గద్దెనెక్కుతా రు. అయితే అదంత సులువు ఏమీ కాదని అంటున్నా రు. ఎందుకంటే అదే కనుక జరిగితే పొరుగున ఉన్న మరో కాంగ్రెస్ పాలిత రాష్ట్రం తెలంగాణా మీద కూడా తీవ్ర ప్రభావం పడుతుంది అని అంటున్నారు. అందుకే అక్కడ కొంత గ్యాప్ తీసుకుంటున్నారు అని చెబుతున్నారు. ఒక వేళ అనూహ్యమైన పరిణామాలు జరిగి సిద్ధరామయ్య కనుక అక్కడ దిగితే తెలంగాణా కాంగ్రెస్ లోనూ అసమ్మతి పెరిగి అక్కడ కూడా కుంపట్లు తయారు అవుతాయని అంటున్నారు.

**డీకే సొంత బలంతో :**

ఇక కర్ణాటకలో చూస్త డీకే శివకుమార్ సిద్దరామయ్య ఇద్దరూ బలమైన నాయకులే. ఇక డీకే సంగతి చూస్తే ఆయన మొదటి నుంచి కాంగ్రెస్ లోనే ఉన్నారు. ఆంతో ఆయనకు సొంత వర్గం కూడా గట్టిగానే ఉంది. దాంతో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా డీకేని చూసి కొంత ఆగాల్సి ఉందనే ప్రచారం ఉంది. అయితే తెలంగాణలో చూస్తే కనుక రేవంత్ రెడ్డి కాంగ్రెస్ బ్రాండ్ కానే కాదు, ఆయన ఎమోషన్ లో సీఎం అయిన వారుగా అంతా చూస్తున్నారు ఇక కాంగ్రెస్ లో ఎంతో మంది ఉన్నారు, ఎన్నో గ్రూప్స్ ఉన్నాయి, కానీ అందులో ఏ వర్గం రేవంత్ రెడ్డి సొంతం అంటే జవాబు ఆలోచించాల్సి వస్తోంది అని అంటున్నారు. ఈ రోజున రేవంత్ రెడ్డి సీఎం కాబట్టి అందరూ ఆయన దగ్గరకు వెళ్తున్నారు. తేడా వస్తే కనుక ఎవరూ ఆయనకు పెద్దగా సపోర్ట్ చేసే సీన్ ఉంటుందా అంటే ఆలోచించాల్సిందే అని అంటున్నారు. అయితే తెలంగాణా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ హ్యాపీగా లేరు అని అంటున్నారు. దీని మీద ఒక సర్వే కూడా బయటకు వచ్చింది అని గుర్తు చేస్తున్నారు.

**జనాలు అంతేగా :**

ఇక తెలంగాణలో రెండేళ్ళ కాంగ్రెస్ పాలన ముగిసింది. మరో వైపు జనాలలో కూడా ఎవరూ ఏమంత సుఖంగా లేరని కూడా సర్వే నివేదికలు వెళ్ళడిస్తున్నాయి. పట్టణాలు అర్బన్ సెక్టార్ జనాలు అయితే అసలు హ్యాపీగా లేరని అంటున్నారు రూరల్ లోనూ పరిస్థితి అలాగే ఉంది. ఇక రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గ్రామీణ ప్రాంతాలలో పర్యటించినది అయితే పెద్దగా లేదని అంటున్నారు. అలాగే గ్రామాల్లో భారీ ప్రాజెక్టులు కానీ కార్యక్రమాలు కానీ లేవని కూడా గుర్తు చేస్తున్నారు. అంతే కాకుండా హైదరాబాద్ లో ఒక్క



కొత్త ప్రాజెక్టు కానీ ఈ రెండేళ్ళ పాలనలో అయితే తెచ్చినది అయితే లేనే లేదనే అంటున్నారు దాంతో అర్బన్ సెక్టార్ అయితే పాలన పట్ల పెదవి విరుస్తోంది అని చెబుతున్నారు.

**హైకమాండ్ ఫోకస్ :**

ఇక రేవంత్ రెడ్డి పాలన మీద ఆయన రాజకీయాల మీద కూడా కాంగ్రెస్ హైకమాండ్ ఫోకస్ పెడుతోంది అని అంటున్నారు. బడా భాయ్ అంటూ తరచూ ప్రధాని నరేంద్ర మోడీని రేవంత్ రెడ్డి కలవడం కూడా కాంగ్రెస్ పెద్దలకు అంతగా నచ్చడం లేదని అంటున్నారు. టెక్నికల్ గా చూస్తే రాజ్యాంగం ప్రకారం సీఎం ప్రధానిని కలవడంలో తప్పు లేదు, అలాగే ఆర్ధికపరమైన అంశాల క్లియరెన్స్ కోసం కేంద్ర సాయం కోసం కలుస్తున్నామని రేవంత్ రెడ్డి చెబుతున్నా కూడా కాంగ్రెస్ హైకమాండ్ అయితే మోడీతో రేవంత్ రెడ్డి భేటీల మీద పెద్దగా ఇష్టపడడం లేదు అని అంటున్నారు. ఇక చూస్తే కేవలం రేవంత్ రెడ్డి ఒక్కరే ఎక్కువగా మోడీని కలుస్తున్నారు అని ప్రచారంలో ఉంది. ఆయన తోటి కాంగ్రెస్ సీఎం కర్ణాటకలో సిద్ధరామయ్య ఉన్నారు. ఆయన మోడీని అసలు కలవడం లేదు కదా అని కూడా గుర్తు చేస్తున్నారు. అంతే కాదు ఇండియా కూటమిలో ఉన్న ఏ ముఖ్యమంత్రి కూడా మోడీతో పెద్దగా టచ్ లోకి రావడం లేదు, కానీ రేవంత్ రెడ్డి మాత్రం అనేక సార్లు కేంద్ర పెద్దలతో భేటీలు అవుతున్నారు. దాంతోనే కాంగ్రెస్ పెద్దలకు కూడా అసంతృప్తి అయితే ఇదే విషయం మీద ఉంది అని అంటున్నారు. అయితే ఏ విషయం అయినా కాంగ్రెస్ పెద్దలు ఫోకస్ లోనే ఉంటుంది అని చెబుతున్నారు. మొత్తానికి చూస్తే కర్ణాటకలో సీఎం కుర్చీ కదిలితే మాత్రం ఆ ప్రభావం ఆ సెగ తెలంగాణాకు కూడా తాకవచ్చు అన్నది రాజకీయంగా అంతా విశ్లేషిస్తున్న మాటగా ఉంది.